సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 26 । జనవరి । 2024



ఎస్ఐ తీరుపై నిరసన

ముంచంగిపుట్టు ఎస్ఐ రవీంద్ర తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. IIలో



విద్యతోనే బంగారు భవిష్యత్తు

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. IIలో



పౌష్టికాహారం పక్కదారి

పౌష్టికాహారాన్ని పక్కదోవ పట్టిస్తూ అంగన్‌వాడీ కార్యకర్త మహిళా పోలీసుకు పట్టుబడింది. IIలో

న్యూస్‌రీల్

రేపు సీఎం జగన్ రాక



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 27న నగరానికి రానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.20 గంటలకు బయలుదేరి భీమిలి నియోజకవర్గం సంగివలస దరి ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన సంగివలస వద్ద ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల బహిరంగ సభ సభాస్థలికి చేరుకుంటారు. 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.35 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- తలారిసింగి మైదానంలో నిర్వహణ



తలారిసింగి మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం భారత గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్‌శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పాడేరులోని తలారిసింగి మైదానాన్ని సిద్ధం చేసింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన శకటాల నిర్మాణాల్లో అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఉదయం 8.20 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ తలారిసింగి పాఠశాల మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.అనంతరం ఉదయం 11.30గంటల వరకు పలు కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అన్యాయం చేసిన చంద్రబాబు

- రోజుకో పార్టీ మారే వారికే టికెట్
- టీడీపీ తిరుగుబాటు నేత సివేరి అబ్రహం



దారెల గిరిజనులతో మాట్లాడుతున్న టీడీపీ తిరుగుబాటు నేత అబ్రహం

ముంచంగిపుట్టు: టీడీపీ పార్టీని నమ్ముకున్న వారికి టికెట్ ఇవ్వకపోవడం బాధాకరం అని ఆ పార్టీ తిరుగుబాటు నేత సివేరి అబ్రహం విమర్శించారు. మండలంలోని దారెల పంచాయతీలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ టీడీపీ పార్టీని నమ్ముకున్న మా కుటుంబానికి చంద్రబాబు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఏ మాత్రం పార్టీకి కష్టపడకుండా, రోజుకో పార్టీ మారే వారికి అరకు టికెట్ కేటాయించడం దారుణమన్నారు. ఇలాంటి వ్యవహారశైలితో ఆపార్టీకి ఓటమి తప్పదన్నారు.

ఎంపీపీకి తప్పిన ప్రమాదం

- ఆయన ప్రయాణిస్తున్న కారుకు ఊడిపోయిన ముందు చక్రం
- అదుపుతప్పి ఆటోను ఢీ



ఊడిపోయిన కారు ముందు చక్రం

కొయ్యూరు: ఎంపీపీ బడుగు రమేష్‌కు ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం సమీపంలో గురువారం ప్రమాదానికి గురైంది. కొయ్యూరు నుంచి నర్సీపట్నం వెళ్తుండగా కారుకు కుడిచేతివైపు ఉన్న ముందు చక్రం ఊడిపోయింది. దీంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎంపీపీకి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సహా పలువురు ఆరా తీశారు. ఆయన క్షేమంగా ఉన్నట్టు తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సెల్ తరంగం.. నిరంతరం

జిల్లాలో సమాచార వ్యవస్థ మెరుగుపడింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం 278 సెల్ టవర్లను వర్చువల్ విధానంలో ప్రారంభించడంతో 944గ్రామాలకు అనుసంధానం ఏర్పడింది. నిరంతర సేవలకు మార్గం సుగమం అవడంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది.

- 278 టవర్లను వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- 944 గ్రామాల్లో అందుబాటులోకి వచ్చిన నెట్‌వర్క్ వ్యవస్థ
- అవస్థలు తప్పడంతో గిరిజనుల ఆనందం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



లైగండ గ్రామంలో సెల్ టవర్‌ను స్థానికంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. ఇప్పటికే జిల్లాలో వంద సెల్ టవర్లను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం గురువారం మరో 278 టవర్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీంతో 944 గ్రామాల్లో సెల్ నెట్‌వర్క్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. 4జీ సేవలు అందుబాటులోకి రావడంతో గిరిజనులంతా మురిసిపోతున్నారు. సెల్ నెట్‌వర్క్ కోసం కిలోమీటర్ల కొద్దీ వెళ్లాల్సిన అవస్థలు తప్పాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.ఈదులపాలెంలో జరిగిన సెల్ టవర్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, సర్పంచ్‌లు గెమ్మెలి అప్పలకొండ, కిల్లు పరమేశ్వరి, పాంగి రాంబాబు, ఎంపీటీసీలు దూసురు మీనా, సచివాలయ కన్వీనర్లు రొబ్బా కృష్ణారావు, గంగరాజు, వేమల గోపి, కృష్ణ, ఈశ్వరరావు, కృష్ణంనాయుడు, రామానాయుడు, కూడా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సెల్ నెట్‌వర్క్ కీలకం..

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు మొబైల్ నెట్‌వర్క్ కీలకమని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జిల్లాలోని సెల్ టవర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని లైగండలో సెల్ టవర్ ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్ టవర్లు వేగంగా నిర్మాణం త్వరితగతిన పూర్తికావడంలో అధికారుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీలు జానకమ్మ, మత్స్యలింగం, సర్పంచ్‌లు శాంతి, వెంకటరావు, నాగేశ్వరరావు,వైస్ ఎంపీపీ ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శాంతి, ఎంపీటీసీ రామారావు పాల్గొన్నారు.

అవస్థలు తప్పాయి



సెల్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల అవస్థలు తప్పాయి. గతంలో 108,104 అంబులెన్స్‌లకు ఫోన్ చేసేందుకు సుమారు 30 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సెల్ టవర్లను అందుబాటులోకి తెచ్చారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– విజయ్‌కుమార్, గుంటసీమ

ప్రధాన సమస్య పరిష్కారం



సెల్ నెట్‌వర్క్ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు నిరంతరాయంగా సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటివరకు ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడేవారు. కొత్తగా 278 సెల్ టవర్లు అందుబాటులోకి రావడం వల్ల దాదాపుగా ప్రధాన సమస్య పరిష్కారమైనట్టే.

– కామరాజు, గేదలబంద, డుంబ్రిగుడ మండలం

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- ఈనెల 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న 49 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీ పోస్టుల భర్తీకి ఈనెల 26 నుంచి వచ్చేనెల 10వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళలు తప్పనిసరిగా టెన్త్ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్థానికంగా నివాసం ఉండే వివాహిత ఈ పోస్టుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. 2023 జూలై ఒకటి నాటికి అభ్యర్థులులు 21ఏళ్ల నిండి, 35ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. 21ఏళ్ల లోపు అభ్యర్థులు లభించని పక్షంలో 18ఏళ్లు పూర్తయిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే ఈ నిబంధనలు వర్తిసాయని ఆయన తెలిపారు.ఖాళీ పోస్టుల వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర అర్హతలకు సంబంధించి స్థానికంగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు. మార్కులు,అర్హతలు ప్రకారం అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని, అభ్యర్థులు మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు.

ఈపీడీసీఎల్ సర్కిళ్లకు అవార్డులు

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవం సందర్భంగా డిస్కమ్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సెక్షన్లు, అధికారులు, సిబ్బందికి మెరిటోరియస్ సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నామని సీఎండీ పృథ్వీతేజ ఇమ్మడి వెల్లడించారు. ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. బెస్ట్ ఆపరేషన్ సెక్షన్‌గా శ్రీకాకుళం సర్కిల్ పరిధిలోని సారవకోట, విజయనగరంలోని జామి, విశాఖలోని అనకాపల్లి డీ–2, రాజమహేంద్రవరంలోని మురమండ, ఏలూరు సర్కిల్‌లోని పెదపాడు ఎంపిక చేశామన్నారు. బెస్ట్ ఆపరేషన్ సబ్ డివిజన్‌గా నరసన్నపేట, రాజాం, నర్సీపట్నం రూరల్, కాకినాడ రూరల్, కొవ్వూరు సబ్‌డివిజన్లు, బెస్ట్ ఆపరేషన్ డివిజన్లగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి, విశాఖ జిల్లా జోన్–1 కార్యాలయం ఎంపిక చేశామని తెలిపారు. అదేవిధంగా బెస్ట్ ఈఆర్వోగా గాజువాక, ఏలూరులోని పాలకొల్లు, బెస్ట్ కన్‌స్ట్రక్షన్ డివిజన్‌గా ఏలూరుకి అవార్డులు అందజేస్తున్నామన్నారు. బెస్ట్ ఎంఅండ్‌పీ డివిజన్‌గా రాజమహేంద్రవరం, బెస్ట్ ట్రాన్స్‌ఫార్మర్స్ డివిజన్‌గా శ్రీకాకుళం, బెస్ట్ డీపీఈ డివిజన్‌గా విశాఖపట్నం, బెస్ట్ క్వాలిటీ కంట్రోల్‌గా రాజమహేంద్రవరం అవార్డులు అందుకోనున్నాయి. వీటితో పాటు వివిధ విభాగాల్లో అత్యుత్తమంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి కూడా మెరిటోరియస్ సర్టిఫికెట్స్ అందజేస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు.

గిరిజన పీడీలకు అరుదైన గౌరవం



ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఫొటో దిగిన జిల్లాకు చెందిన గిరిజన పీడీలు (వెనుక చివరి వరుసలో)

ప్రధానమంత్రితో ఫొటో అవకాశం

సాక్షి, పాడేరు: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదితో జిల్లాకు చెందిన గిరిజన వ్యాయామ ఉపాధ్యాయలు గ్యాలరీ ఫొటో దిగే అరుదైన అవకాశం దక్కింది. క్రీడలు,ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం గిరిజన సంక్షేమశాఖకు చెందిన పాడేరు మండలం దిగుమోదాపుట్టు పాఠశాల పీడీ సోమెలి సింహాచలం, హుకుంపేట మండలం పెదగరువు పాఠశాల పీడీ మత్స్యరాస సుధారాణి, రంపచోడవరం మండలం బందపల్లి పాఠశాల పీడీ కె.తిరుపతిరావు, బాలబాలికలు ఢిల్లీ తరలివెళ్లారు. వారందరికి ప్రధానమంత్రి నరేంద్రమోదితో గురువారం గ్యాలరీ ఫొటో దిగే అవకాశం లభించింది.

మహిళల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



జి.మాడుగులలో డ్వాక్రా మహిళలకు అసరా చెక్కును అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



అడ్డతీగలలో మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, సమన్వయకర్త విశ్వేశ్వరరాజు
- ఆసరా చెక్కు పంపిణీ

జి.మాడుగుల: మహిళల సంక్షేమం ఆర్థికాభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. స్థానిక రామాలయం ఆవరణలో గురువారం వైఎస్సార్ అసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ముఖాల్లో చిరునవ్వులే జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వాదమని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకురావాలని వారు కోరారు. ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. డ్వాక్రా మహిళలతో కలసి ఎమ్మెల్యే థింసా నృత్యం చేశారు. మండలంలో 163 డ్వాక్రా సంఘాలకు రూ.12లక్షల 35వేల143, 230 మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి 2కోట్ల 96 లక్షల వెయ్యి రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామ్మకృష్ణ, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, పాంగి లక్ష్మి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, కొండబాబు,మాతే చిలకమ్మ, గంగరాజు, జిల్లా కార్యదర్శి కూడా సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రామకృష్ణ, అంద్రయ్య, ఏపీఎం సుంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శేఖర్, సోమలింగం, పండన్న, చిట్టిబాబు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన : ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: అమలుకాని హామీలిచ్చి గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పేర్కొన్నారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మహిళా సంఘాలతో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళల నెత్తిన అప్పుల భారం మిగిల్చారన్నారు. ఆ తరువాత అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేసి వారిని గట్టెక్కించారన్నారు. కేవలం అడ్డతీగల మండలంలోనే నాలుగు దఫాలు కలిపి రూ.8.73 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. నియోజకవర్గంలోని 11 మండలాల్లో రూ.80 కోట్ల మేర మాఫీ జరిగిందన్నారు. అక్కచెల్లెమ్మల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలని అనేక విధాలుగా వారికి చేయూత ఇస్తున్నారన్నారు. అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్న సంక్షేమ సర్కారును మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రూ.2.19 కోట్ల విలువైన ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, ఇందిరాక్రాంతిపథం ఏపీడీ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు తోట రాజేశ్వర్రావు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



సీనియర్ ఓటర్లను సత్కరించిన జేసీ కార్తీక్, ఇతర అధికారులు



రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



రంపచోడవరంలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న అధికారులు

జాయింట్ కలెక్టర్ కార్తీక్

సాక్షి,పాడేరు: ఓటు హక్కును ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 80 ఏళ్లు దాటిన సీనియర్ ఓటర్లు, ట్రాన్స్‌జండర్, పీవీటీజీ ఓటర్లను జేసీతోపాటు అధికారులు సత్కరించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న 18,19ఏళ్ల యువతీ,యువకులకు ఎపిక్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదదన్నారు. తద్వారా మన భవిష్యత్తు మనమే తీర్చుదిద్దుకునే అవకాశం ఉందన్నారు.ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా,నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. అభ్యర్థులు ఎవ్వరు నచ్చని పక్షంలో నోటాకు ఓటు వేయవచ్చని ఆయన సూచించారు.అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో వి.వి.రమణ, ఎస్‌డీసీలు పి.మురళీకృష్ణ, వి.వి.ఎస్.శర్మ, తహసీల్దార్ త్రినాథరావునాయుడు పాల్గొన్నారు.



ఓటరు గుర్తింపు కార్డులతో యువతీ యువకులు

నిర్భయంగా ఓటు హక్కు వినియోగం : రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. రంపచోడవరం లెనోరా కళాశాల ఆవరణలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. దేవీపట్నం సెంటర్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. లెనోరా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా ముఖ్యమైనవి అన్నారు. రంపచోడవరం పంచాయతీలో ఉత్తమ సేవలందించిన సుధా ప్రకాష్, ఎక్కువ ఓటర్లను నమోదు చేయించిన బీఎల్వో ఆనందీశ్వరరావు, ఎస్‌కే బాషా, సీహెచ్ రమాదేవిలకు బహుమతులు అందజేశారు. ఎక్కువ సంఖ్యలో యువత ఓట్లను నమోదు చేయించిన కె. చిన్నారెడ్డి, రామతులసి, జి. లీలా ప్రభాకర్‌కు బహుమతులు అందజేశారు. సీనియర్ సిటిజెన్లను సన్మానించి, యువతకు కొత్త ఓటరు కార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీడీ అబ్బులాం, ఎస్‌డీసీ జాన్‌రాజ్, తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లాభాల బాటలో నడిపిద్దాం

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

పాడేరు : ఆర్టీసీని లాభాల బాటలో తీసుకువెళ్లేందుకు ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పని చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఎ. మల్లికార్జునరెడ్డి కోరారు. గురువారం ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఉద్యోగులు, కార్మికులతో సమావేశమయ్యారు. వారి నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు మంకీ క్యాప్స్, హ్యాండ్ గ్లౌజులు, ఉలెన్ జెర్సీలను పంపిణీ చేశారు. ఇటీవల మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ భార్యకు ఎడిషనల్ మానిటరింగ్ బెనిఫిట్(ఏఎంబీ) స్కీం కింద రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఆయనను ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులు శాలువా కప్పి సత్కరించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబ్బులాం ఆదేశం

గంగవరం : విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు అయిన టెన్త్‌లో మంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబ్బులాం ఆదేశించారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర, బాలికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహాల్లో సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు.రెండు ఉన్నత పాఠశాలల్లో రికార్డులను, పిల్లల, ఉపాధ్యాయుల హాజరును ఆయన పరిశీలించారు. పదోతరగతి పిల్లల పట్ల దృష్టి పెట్టాలని నూరుశాతం ఫలితాలు సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఝాన్సీహేన్సన్, సత్యనారాయణలు ఆశ్రమపాఠశాలల్లో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పదోతరగతి పరీక్షా కేంద్రంలో సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. గంగవరం ఆశ్రమబాలికోన్నత పాఠశాలలో పరీక్షా గదులు గురించి వివరాలను హెచ్ఎం ఝాన్సీ హేన్సన్ డీడీకి వివరించారు. టేకులవీధి ఆశ్రమ పాఠశాలను డీడీ సందర్శించారు.



గంగవరం ఆశ్రమపాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ అబ్బులాం

ఎస్ఐ తీరుపై నిరసన

ముంచంగిపుట్టులో గిరిజనుల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: స్థానిక ఎస్ఐ రవీంద్ర తీరును నిరసిస్తూ బుంగాపుట్టు,లక్ష్మీపురం, బరడ పంచాయతీలకు చెందిన గిరిజనులు గురువారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. స్థానిక ఇందిరాకాలనీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సుమారు 300 మంది గిరిజనులు ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంజాయి, ప్రైవేట్ వాహనాల్లో అధిక లోడు.. ఇలా ఏదొక నెపం చూపిస్తూ తమను కొడుతున్నారని వారు ఆరోపించారు. సోదాల పేరిట ఇళ్లల్లోకి వెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారశైలితో పోలీసులంటేనే భయమేస్తోందని వారు వాపోయారు. ఎస్ఐ రవీంద్ర మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించిన వారిని జి.మాడుగుల సీఐ రమేష్ అడ్డుకున్నారు. ఆందోళనకు గల కారణాలను వారి నుంచి తెలుసుకున్నారు. తమ దృష్టికి ఈ విషయం తీసుకువస్తే చర్యలు తీసుకునేవారమన్నారు. రోడ్లపై ఆందోళన చేయడం సరైన పద్ధతి కాదని ఆందోళనకారులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎస్ఐ తమపై దాడులు చేస్తున్నారని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. సీఐ సూచన మేరకు వారు రాతపూర్వకంగా ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆందోళన విరమించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండలంలోని కంద్రుం పంచాయతీ సర్రాయి గ్రామంలో రూ.3లక్షలతో ఆధునికీకరించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని గురువారం పీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. పాఠశాలలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, బొమ్మలు వే యించాలని ఆయన ఆదేశించారు. ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న నలుగురి అరెస్టు



సారా తరలిస్తున్న నిందితులతో ఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు

జి.మాడుగుల: సారా విక్రయానికి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో నుర్మతి ఏవోపీ పరిధిలో వాకపల్లి టి.జంక్షన్ వద్ద బుధ, గురువారాలు రెండు రోజుల పాటు పోలీసులు తనిఖీలు చేశారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులు ప్లాస్టిక్స్ డబ్బాలతో సారా తరలిస్తుండగా వారిని అదుపులోనికి తీసుకొని తనిఖీ చేయగా సారీ పట్టుబడింది. వారి నుంచి 40లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పౌష్టికాహారం పక్కదారి

- పట్టుబడిన అంగన్‌వాడీ టీచర్
- చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక

రంపచోడవరం: పౌష్టికాహారాన్ని పక్కదోవ పట్టిస్తూ అంగన్‌వాడీ కార్యకర్త మహిళా పోలీసుకు పట్టుబడింది. రంపచోడవరం సాయినగర్-6 కేంద్రంలో చిన్నారులకు ఇవ్వాల్సిన పాలు ప్యాకెట్లు, గుడ్లను తీసుకువెళ్లడాన్ని గుర్తించిన ఓ మహిళ గురువారం వెంటనే మహిళా పోలీసుకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే ఆమె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ రాఘవకు సమాచారం అందించింది. వారిద్దరు ఈ ఘటనపై అంగన్‌వాడీ టీచర్ టీకూరి సుమాంజలి, ఆయా కొంగర లక్ష్మిని విచారించారు. వారినుంచి వాంగ్మూలం నమోదు చేసినట్టు సూపర్‌వైజర్ తెలిపారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాను ఉద్యోగాల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఐసీడీఎస్ పీవో సంధ్యారాణి తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లను నుంచి సరుకులు కొనుగోలు చేసిన వారిపై కూడా చర్యల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పేకాట శిబిరంపై దాడి



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

గూడెంకొత్తవీధి: రింతాడ గ్రామ శివార్లలోని రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న పదిమంది వ్యక్తులను గురువారం పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. రింతాడ పరిసరాల్లో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో పోలీసు సిబ్బంది అక్కడకు వెళ్లి శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న పదిమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.88,320 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డకు చెందిన ఇరువురు వ్యక్తులు సమ్మల నాగేంద్ర, నల్లబెల్లి నానిబాబు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ నాగేంద్ర అడ్డతీగల సీహెచ్‌సీకు రిఫర్ చేశారు. బైక్‌పై నాగేంద్ర, నానిబాబులు జడ్డంగి నుంచి వట్టిగెడ్డకు వస్తుండగా సింగంపల్లి వద్ద ఎదురుగా వస్తున్న గూడ్స్ వ్యాన్, బైక్ పరస్పరం ఢీ కొట్టుకోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెప్పారు.

ఏపీఈఆర్‌సీ విచారణకు ఏర్పాట్లు

విశాఖ సర్కిల్ పరిధిలో 7 చోట్ల విచారణకు పాల్గొనే అవకాశం



విచారణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు అమలు చేయనున్న వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై ఏపీఈఆర్‌సీ ఈ నెల 29 నుంచి 4 రోజుల పాటు విశాఖ వేదికగా బహిరంగ విచారణ నిర్వహిస్తోందని విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఏడు చోట్ల విచారణకు పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ భవన్‌లోని విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఎస్ఈ ఆఫీస్, జోన్-1 ఈఈ కార్యాలయంతో పాటు కంచరపాలెంలోని జోన్-2 ఈఈ కార్యాలయం, మధురవాడలోని జోన్-3 ఈఈ కార్యాలయం, గవరపాలెంలోని అనకాపల్లి ఈఈ కార్యాలయం, కశింకోటలోని ఈఈ కార్యాలయం, పెదబొడ్డేపల్లిలోని నర్సీపట్నం ఈఈ కార్యాలయం, కొత్త పాడేరులోని పాడేరు ఈఈ కార్యాలయం నుంచి విచారణకు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మాక్ హియరింగ్ నిర్వహించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి రోజూ ఇప్పటికే ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా నమోదు చేసుకున్న వారి అభిప్రాయాలు తీసుకుంటారన్నారు. అనంతరం పేర్లు నమోదు చేసుకోని వారి నుంచి కూడా ఈఆర్సీ అనుమతితో అభిప్రాయాలు తెలియజేయవచ్చని తెలిపారు.

80 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎస్ఐ అశ్రితాత

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖ నగరానికి కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని పెందుర్తి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జి.మాడుగులకు చెందిన మంజీరు వెంకటరమణ, పాడేరుకు చెందిన మజ్జి చిన్నబ్బాయి ఏజెన్సీ ప్రాంతం నుంచి స్విఫ్ట్ కారులో 80 కిలోల గంజాయిని నగరానికి తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెందుర్తి పోలీసులు సరిపల్లి వద్ద కాపు కాసి కారును తనిఖీ చేశారు. అందులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని తహసీల్దార్ శ్యాంప్రసాద్ ముందు ఉంచారు. ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో పెందుర్తి ఎస్ఐ అశిరితాత, హెచ్‌సీలు సత్యనారాయణ, కృష్ణ, పీసీ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీసౌజన్య

అనకాపల్లి : రాజస్థాన్‌లోని మహావీర్ క్రీడామైదానంలో జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలు జరగనున్నాయని ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.వి.సత్యనారాయణ చెప్పారు. పోటీలకు హాజరయ్యే బాలబాలికల జట్లకు శిక్షణ శిబిరాన్ని జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో గురువారం 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ప్రారంభించి మాట్లాడారు. 40వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే జట్లకు శిక్షకులుగా జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.రమణరావు, కోచ్‌లు జి.రాజు, ఎల్.త్రిమూర్తులు, ఎన్‌సీసీ అధికారి జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయిని పూర్ణిమలు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి రాంబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి




మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను జి.మాడుగుల సీఐ రమేష్ గురువారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను గుర్తించామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మారుమూల బూసిపుట్టు, రంగబయలు,బుంగాపుట్టు పంచాయతీల్లోనూ ఓటింగ్ జరుగుతందని పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఎస్ఐ రవీంద్ర తదితరులున్నారు.

విదేశీ యువకునిపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

పెదగంట్యాడ: యారాడ తీరంలో విదేశీ యువకునిపై దాడి చేసిన ముగ్గురు యువకులను న్యూపోర్టు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. న్యూపోర్టు సీఐ యర్రంనాయుడు తెలిపిన వివరాల మేరకు.. మల్కాపురం ప్రాంతం శ్రీహరిపురానికి చెందిన అంకం బాబీకుమార్ (19), జనతా కాలనీకి చెందిన స్టైన్ సాయిప్రసాద్ (20), ఇందిరా కాలనీకి చెందిన బాలసారి ప్రతాప్ (20)ను అరెస్టు చేశారు. స్విట్జర్లాండ్‌కు చెందిన నోహ ఎల్లియాస్‌పై వీరు ముగ్గురూ దాడి చేసి అతని సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న న్యూపోర్టు లా అండర్ ఆర్డర్ సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు ప్రసాద్, శ్రీనివాస్ బృందాలుగా విడిపోయి దాడి చేసిన ముగ్గురిని 12 గంటల వ్యవధిలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను సీపీ రవిశంకర్ అభినందించారు.

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



పురుషుల కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

చోడవరం : రాష్ట్రస్థాయి మహిళలు, జిల్లా పురుషుల కబడ్డీ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చోడవరం మండలం అంకుపాలెంలో శ్రీ దుర్గాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ రెండు విభాగాల్లో వేరువేరుగా పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. రాష్ట్రం నలుమూలల 9 జిల్లాల నుంచి మహిళలు, పురుషులకు చెందిన 30 జట్లు ఇక్కడ ఈ పోటీల్లో తలపడుతున్నాయి. దుర్గాంబిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో వచ్చి క్రీడాకారులను భారీ ఊరేగింపు మధ్య అంకుపాలేనికి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్రీడా కోర్టుల ప్రాంగణంలో పోటీలను చోడవరం సీఐ శ్రీనివాసరావు ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులంతా దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, కృష్ణ, కడప, గుంటూరు, చిత్తూరు జిల్లా నుంచి మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొనున్నాయి. మొదటి రోజు గుంటూరు-కృష్ణ, విశాఖపట్నం-శ్రీకాకుళం జట్లు పోటీ పడ్డాయి. జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి.